

# మగాడి దుఃఖం

లక్ష్యం దూసుకుపోయిన తుపాకీగుండులా ఆ వార్త క్షణంలో మా ఆఫీసులోకి దూసుకొచ్చి గుప్పు మంది.

ఎక్కడి వాళ్లక్కడ హుటాహుటిన ఫైళ్లన్నీ పారేసి శంకరం వెనకపరుగెత్తాం.

శంకరంభార్య సంధ్యకు లారీ ఏక్సిడెంట్ అయ్యిందట! అక్కడికక్కడే ప్రాణాలు విడిచిందట''

పావుగంటకు ముందే లంచ్ టైంలో శంకరానికి టిఫిన్ తేగా మా స్టాఫ్ అందరం చూశాం.

అంతలోనే ఆమెను మృత్యువు కబళించడం!

శంకరానికి, సంధ్యకు పెళ్లైంది ఇటీవలే! సంవత్సరం కూడా దాటలేదనుకుంటా! ఆరోజు రిసెప్షన్‌కి వెళ్లిన స్టాఫ్ అందరం శంకరం అదృష్టాన్ని వేనోళ్ల పొగిడాం.

మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా వున్న శంకరం, సంధ్యలు అన్యోన్యమైన జంటగా పేరు తెచ్చుకున్నారు.

సంధ్య కేవలం అందంలోనే కాదు, గుణంలో కూడా నిజంగా సుందరే!

శంకరానికి ఉదయం లేచినుండి అతని పన్లన్నీ తానే స్వయంగా కన్నతల్లిలా చూస్తుంది.

''భోజ్యేషు మాతా...

కరణేషు మంత్రీ..'' అనే శ్లోకానికి నిజమైన భాష్యం సంధ్య

సంధ్య రాకతో శంకరం జీవితమే మారిపోయింది. దురలవాట్లన్నీ దూరం చేస్కున్నాడు. కనీసం సిగరెట్‌కూడా త్రాగడం లేదు. అతని మనసులో ఇరవై నాల్గు గంటలు సంధ్యే! సంధ్య నా జీవితంలో దేవతరా!'' అని శంకరం నాతో చాలాసార్లన్నాడు.

ఆఫీస్ ఇంటికి దగ్గరే కావడంతో రోజూ లంచ్ టైంకి ఆ వ్వటికప్పుడు భర్తకోసం ప్రత్యేకంగా వండి తీసుకొచ్చి, అతనికి ఆప్యాయంగా వడ్డించేది.

ఆరోజు కూడా అలాగే టిఫిన్ తీసుకొచ్చి ఇంటికి వెళ్తుంటే లారీ ఆక్సిడెంటయ్యింది.

మేం ఆ స్పాట్‌కి చేరుకునే సరికి మృతదేహాన్ని పోస్టు మార్టంకు తీసుకువెళ్లారు.

తెల్లారి శవాన్ని ఇంటికి తెచ్చారు.

శంకరం పరిస్థితి వేరే చెప్పనవసరంలేదనుకుంటా! గుండె పగిలి చెట్టంత మనిషి కుప్పకూలి పోయాడు.

సంధ్యా నువ్వులేంది నేనెలా బ్రతకను సంధ్యా నన్నూ నీతో తీస్కెళ్లిపో!'' అంటూ గుండెలు బాదుకుంటూ చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నాడు. అతని బంధువులు, మేం అతణ్ని ఎంతగా ఓదార్చినా లాభం లేకపోయింది.

శవయాత్ర బయలుదేరే ముందు, నా సంధ్య వెళ్లిపోతూంది. నా జీవితంలో చీకటి నింపి తాను వెళ్లిపోతూంది''

అని దబదబా తలను నేలకు బాదుకున్నాడు.

నాకు అంత బాధలోనూ ఆశ్చర్యం వేసింది. నిజంగా శంకరం భార్యను ఎంతగా ప్రేమిస్తున్నాడు.

విశ్వనాథం సురేష్

సంధ్య లేకుండా అసలతడు బ్రతకగలడా? అనిపించింది.

* *** *

ఆ తర్వాత నెలకే శంకరం ఆ వూరి నుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

అక్కడే వుంటే సంధ్య జ్ఞాపకాలు తనను వెంటాడి బాధిస్తాయని అన్నాడు. నాకూ నిజమే అనిపించింది. నాంపల్లి స్టేషన్‌దాకా వెళ్లి శంకరానికి సెండాఫ్ ఇచ్చాను. అంతే! ఆ తర్వాత శంకరం ఇక నాకు కనిపించలేదు. కనీసం ఉత్తరం ముక్కైనా వ్రాయలేదు.

ఆర్నెల్లు గడిచాక ఓ పనిబడి హైద్రాబాద్ వెళ్లినపుడు ఓ సినిమా థియేటర్‌లో కనిపించాడు.

శంకరం!

ఒంటరిగా కాదు— 'రెండోభార్య' సరళతో!